

ప్రచారానికి తెర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)


పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. మరోవైపు ప్రలోభాలకు తెరలేచింది. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలను తలపించే విధంగా మారడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. పట్టభద్రుల స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

● హోరాహోరీగా ప్రచారం

ఈసారి అభ్యర్థులందరూ నాలుగు నెలల ముందు నుంచే ఓటర్లను చేర్పించడంపై దృష్టి పెట్టారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో 3,55,189 మంది, ఉపాధ్యాయ స్థానంలో 27,088 మంది ఓటర్లు నమోదయ్యారు. ఓటర్లను చేర్పిస్తూనే ప్రచారంపై దృష్టి పెట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు, మండలాల వారీగా, నియోజకవర్గాల వారిగా వృత్తుల వారీగా సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ తరుపున ముఖ్యమంత్రితోపాటు ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ప్రచారం నిర్వహించారు. బీజేపీ తరుపున కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారం నిర్వహించారు. ఇరు పార్టీలు కొన్ని ప్రాంతాల్లో 25 మంది ఓటర్లకు, మరికొన్ని చోట్ల 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించారు. ఆయన ఆధ్వర్యంలో గ్రామస్థాయి కమిటీలు ఓటర్లను కలుస్తూ ప్రచారం నిర్వహించారు. వారే ఆ ఓటర్లను గురువారం జరుగనున్న పోలింగ్‌కు హాజరై ఓటు వేయించుకునేలా ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రచార పర్వం ముగిసింది. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ మధ్య ముక్కోణపు పోటీ ఉంది. దీంతో ఆయా పార్టీల నేతలు, అభ్యర్థులు, శ్రేణులు మిగిలిన రెండు రోజుల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

● ప్రలోభాల పర్వం ప్రారంభం

ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి సంబంధించి ఒక అభ్యర్థి ఓటరుకు 5వేల రూపాయల చొప్పున, మరో అభ్యర్థి 3వేల రూపాయల చొప్పున పంపిణీ చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ పంపిణీ ఇప్పటికే పూర్తయిందని సమాచారం. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు పంపిణీ పూర్తి చేయాలని భావిస్తున్నారని తెలుస్తున్నది. ఒక్కో అభ్యర్థి తనకు సానుకూలంగా ఉండే ప్రాంతాల్లో ఓటర్లను గుర్తించి నియోజకవర్గం మొత్తంగా లక్ష నుంచి లక్షన్నర మందికి వెయ్యి నుంచి మూడు వేల రూపాయల వరకు పంపిణీ చేసేందుకు ముందస్తుగానే ఏర్పాట్లు చేశారనే ప్రచారం జరుగుతోంది. పట్టభద్రుల స్థానంలో 56 మంది పోటీ పడుతున్నా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ మధ్య ముక్కోణపు పోరు నెలకొంది.



సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

హుజూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్నాయి. ప్రతి ఓటరును కలుసుకునేందుకు అభ్యర్థులకు సమయం లేకపోవడంతో సోషల్ మీడియాను ఆశ్రయించారు. గ్రామాల్లో పట్టభద్రుల పేర్లను గుర్తిస్తూ తమ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. . ఒక అభ్యర్థి తరుపున రోజుకు సుమారు 15 నుంచి 20 సార్లు మెసేజ్‌లు, ఫోన్లు వచ్చాయి.






కమాన్ రోడ్ రామేశ్వర ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

శంభో శంకర

● నేడే మహా శివరాత్రి ● ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు



కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 25: మహా శివరాత్రి పర్వదినాన్ని జిల్లా వాసులు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకో నున్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షతో ప్రత్యేక పూజలు, అర్చన లు, జాగరణలు చేస్తారు. జిల్లాలోని శైవక్షేత్రాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. నగరంలోని పాతబజార్ గౌరీశంకర, కమాన్‌రోడ్ రామే శ్వర, భగత్‌నగర్ భవానీశంకర, ఆదర్శనగర్ రాజరాజేశ్వర, మాండవ్య నదీ తీరంలోని మార్కండేయ శివాలయం శివరాత్రి శోభను సంతరించుకున్నాయి. బుధవారం జరిగే వేడుకలకు ఆయా ఆల యాల నిర్వాహకులు, అధికారులు, పాలకవర్గం, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. పాతబజార్ గౌరీశంకరాలయం వద్ద దర్శనం కోసం వేర్వేరుగా క్యూలైన్లు, బారీకేడ్లు ఏర్పాటు చేశారు.

● మార్కెట్‌లో సందడి

శివరాత్రి పర్వదిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి కనిపించింది. మంగళవారం రాత్రి వరకు వివిధ గ్రామాల నుంచి అమ్మకందారులు పండుగకు కావాల్సిన వస్తువులను, పూలను, పండ్లను తెచ్చి అమ్మారు. రాత్రి పొద్దుపోయే వరకు కొనుగోళ్లు సాగాయి. మామిడాకు, బంతి, చేమంతులు కూడా బస్తాలకొద్ది తీసుకొవచ్చి రాశులుగా పోసి అమ్మగా ఇక పూలు, పండ్ల ధరలు చుక్కలు చూపాయి.



పూజ సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళ



పాతబజార్ శివాలయం వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు

కొత్తపల్లిలో పారిశుధ్యం మెరుగుపడాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విలీనం చేసిన కొత్తపల్లి పట్టణంలో పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కమిషనర్ కొత్తపల్లిలోని పలు కాలనీల్లో, రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. అనంతరం అక్కడి డంపింగ్‌యార్డును సందర్శించి చెత్తను పరిశీలించి ఆదేశాలు, సూచనలు చేశారు. హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం, నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాటాడుతూ కొత్తపల్లి పట్టణంలో పారిశుధ్య పనులు మెరుగ్గా చేయాలని, పట్టణ ప్రకృతి వనాల్లోని మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని సూచించారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, కలుపు మొక్కలు లేకుండా తొలగించి, నర్సరీ బెడ్స్ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో హరితహారంలో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో పెంచాలన్నారు.

పోలింగ్‌రోజు విద్యాసంస్థలకు సెలవు ఇవ్వాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న ఉన్నందున ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలకు సెలవు ప్రకటించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టభద్రులకు ఓటు వేసు కునే అవకాశం కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసిందన్నా రు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఓటు హక్కు ఉన్న సిబ్బందికి కొన్ని గంటలు మాత్రమే పర్మిషన్ ఇస్తామని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చింద న్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాలను కచ్చితంగా పాటించి సిబ్బందికి రోజంతా సెలవు దినాన్ని ప్రకటించలాన్నారు. పట్టభద్రులైన సిబ్బదికి ఇబ్బందులు కలిగిస్తే బీజేపీ కార్యకర్తలకు ఫిర్యాదు చేయాలని, ఆ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఓటు హక్కును ఆపే అధికారం ఎవరికీ లేదన్నారు.

బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి..

● అడుగడుగునా బీసీలను అణచివేస్తున్న బీజేపీ
● పట్టభద్రుల ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి
● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

5

ఎమ్మెల్సీ ఫలితాలను రెఫరెండంగా భావిస్తారా..

● ఎన్నికల్లో గెలిచేది బీజేపీ అభ్యర్థులే..
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

5

తండ్రి ఆస్తి కోసం కొడుకు పథకం

● హుజూరాబాద్ చోరీని 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
● కొడుకు, కోడలుతో పాటు మరో ముగ్గురు అరెస్టు, పరారీలో ఒకరు
● 70 తులాల బంగారం, రూ.1.5 లక్షలు స్వాధీనం

5

భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం

● విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

మానకొండూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం కలుగుతుందని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. మానకొండూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. భవిత కేంద్రం సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్రం నిర్వహణకు కావాల్సిన అవసరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి, టీచింగ్ మెటీరియల్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రంలోని అన్ని భవిత కేంద్రాల్లో ఒకే విధమైన టైమ్‌టేబుల్, సిలబస్‌ను నిర్ణయించి అమలు చేస్తామని అన్నారు. భవిత కేంద్రంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రత్యేక డైరీని నిర్వహించాలన్నారు. అవసరమైన టీచింగ్, లర్నింగ్ మెటీరియల్ సమకూరుస్తామని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరుపున భవిత కేంద్రాల్లో రెయిలింగ్‌తో కూడిన ర్యాంపులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో పని చేస్తున్న సిబ్బంది వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన కేంద్రంలో స్పీచ్ థెరపిస్టును నియమించుకొని అవసరమైన సౌకర్యాలను సమకూర్చుకోవాలని సూచించారు. కొందరు అధికా రులు దివ్యాంగులైన పిల్లలను చిన్నచూపు చూస్తున్నారని తల్లి దండ్రులు తెలపగా అటువంటి సంఘటనలు పునరావృతం కా కుండా చర్యలీ తీసుకుంటామని యోగితా రాణా అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, డీఈవో జనార్దన్‌రావు, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంఈవో మధుసుదనాచారి, ఎంపీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మానకొండూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

● డీఈవోపై ఆగ్రహం

భవిత కేంద్రంలో కొనసాగుతున్న కార్యక్రమాలు, విద్యార్థులు ఎంత మంది, వాటి నిర్వహణ వివరాలను యోగితా రాణా జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావును అడిగారు. డీఈవో సరైన సమాదానం చెప్పక పోవడంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 111 మంది దివ్యాంగులు ఉండగా 16 మంది భవిత కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థికి ఎస్కార్ట్ రవాణా భత్యాలు చెల్లించాలని ఆదేశించారు. దివ్యాంగులకు అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు.



నుస్తులాపూర్‌లో దివ్యాంగులతో మాట్లాడుతున్న యోగితా రాణా

● దివ్యాంగుల పునరావాస కేంద్రం పరిశీలన

తిమ్మాపూర్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని నుస్తులాపూర్‌లో నిర్వహిస్తున్న దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. అనంతరం డైట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, డీఆర్డీవో శ్రీధర్, డీఈవో జనార్దన్‌రావు, సంస్థ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య, జేడీ వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.





మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ విద్యుత్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్నచోట ఇప్పటి వరకు ఆరు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, ఏడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను సామర్థ్యం పెంచామన్నారు. మూడు నెలలుగా వేసవి కాల ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా సరిపడా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సబ్ స్టేషన్‌లో సూక్ష్మ లోపాలను గుర్తించడానికి థర్మల్ ఇమేజింగ్ కెమెరాలను వాడుతున్నామని, ఈ కెమరాలతో లోపాలను గుర్తించి సరి చేస్తూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వోల్టేజ్ లో హెచ్చు తగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఉపయోగపడుతాయన్నారు. ఇప్పటి వరకు లైన్లలో ఆరు కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేశామని, ఇవి సబ్‌స్టేషన్, లైన్లలో ఓవర్ లోడ్‌ను నియంత్రిస్తాయని తెలిపారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు

మానకొండూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు జరుగుతుందని, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని మానకొండూర్ తహసీల్దార్ రాజేశ్వరి అన్నారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన అభ్యసన పరికరాలు, కళాకృతుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రకాల వస్తువులను తయారు చేయడం అభినందనీయమన్నారు. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో మానకొండూర్ పరిధిలో శ్రీనివాస్‌నగర్ ప్రథమ, లలితాపూర్ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. గంగిపల్లి పరిధిలో దేవంపల్లి ప్రథమ, గట్టుదుద్దెనపల్లి ద్వితీయ, వెల్ది పరిధిలో లింగాపూర్ ప్రథమ, వెల్ది ద్వితీయ, పచ్చునూర్ పరిధిలో యాదవనగర్ ప్రథమ, పోచంపల్లి పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. మండల స్థాయిలో యదవనగర్ ప్రథమ, దేవంపల్లి ద్వితీయ, లింగాపూర్ తృతీయ స్థానంలో నిలిచాయి. ఆర్ట్స్, క్రాఫ్ట్ విభాగంలో కేజీబీవీ ప్రథమ, మనకొండూర్ బాలికల పాఠశాల ద్వితీయ స్థానం, టీఎల్ఎం విభాగంలో పోచంపల్లి ప్రథమ, గట్టుదుద్దెనపల్లి ద్వితీయ స్థానం సాధించాయి. ఉన్నత పాఠశాలల విభాగంలో చెంజర్ల ప్రథమ స్థానం, అన్నారం ద్వితీయ స్థానం సాధించాయి. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంఈవో మధుసుదనాచారి పాల్గొన్నారు.



మానకొండూర్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి



రాజన్నా.. వస్తున్నామయ్యా




కాంతులీనుతున్న వేములవాడ దేవస్థానం

- శివనామస్మరణతో మార్మోగుతున్న వేములవాడ రాజన్న క్షేత్రం
- మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం
- భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం

సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు సాగే రాజన్న జాతరకు తెలంగాణతోపాటు ఆంధ్రా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులను తీర్చుకోనున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున అధికారులు, అర్చకులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి పర్వదినం బుధవారం వేములవాడ రాజన్న సన్నిధిలో జాగరణ చేయడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. నాలుగు లక్షల మంది భక్తులు తరలివస్తా రనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అనుబంధ దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను ఉచితంగా దేవాలయాన్ని చేర్చే విధంగా వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి 14 బస్సులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఏర్పాట్లను నిరంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పర్య వేక్షిస్తున్నారు. పోలీస్ ఔట్‌పోస్టులు, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేశారు.


ఆలయ ఆవరణలో పోలీస్ సిబ్బంది

జిల్లాస్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. 1,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఉచిత భోజనం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. వేములవాడకు వచ్చే అన్ని దారుల్లో భారీ స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. దేవాలయం ప్రాంగణంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివార్చన పేరిట సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య చర్యలను చేపట్టారు. ఇందుకోసం జోన్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

ప్రత్యేక పూజలు..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాజరాజేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి 7 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి 7.30 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ద్వారా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు నిశీ పూజ అనంతరం భక్తులకు స్వామివారి లఘు దర్శనం, కోడె మొక్కులు కొనసాగి స్తారు. బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా లఘు దర్శనాలు, కోడె మొక్కులు నిరంతరాయంగా కొనసాగుతాయి. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల వరకు స్థానికులకు సర్వదర్శనం, 1.30 నుంచి 2.30 గంటల వరకు దాతలు, స్థానిక అధికారులకు దర్శనం, 3.30 నుంచి 3.40 వరకు ఆలయ శుద్ధి, మంగళ వాయిద్యాలు, 3.40 నుంచి 4.23 వరకు సుప్రభాతం, ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ, అర్చకుల దర్శనం, అనంతరం నిరంతరాయంగా దర్శనాల ఉంటాయి. సాయంత్రం 6.08 నుంచి స్వామి వారి కల్యాణ మండపంలో మహా లింగార్చన, రాత్రి 11.30 నిమిషాలకు లింగోద్భవ కాలలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభి షేకం నిర్వహిస్తారు.

రూ.2.03 కోట్లతో ఏర్పాట్లు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రూ.2.03 కోట్లతో ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, చలువ పందిళ్లు, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, రాజన్న జల ప్రసాదం, మజ్జిగ ప్యాకెట్లు, శుద్ధ జల క్యాన్లు, వాటర్ ట్యాంకర్‌లు వంటివి ఏర్పాటు చేశారు. హెల్ప్‌సెంటర్లు, ఆరోగ్య శిబిరాలను సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ధర్మగుండంలో నీటిని నిరంతరం శుభ్రం చేయడంతోపాటు 137 తాత్కాలిక స్నానపు గదులు, 60 చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే భక్తుల కోసం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, హన్మకొండ, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, నిజామాబాద్, జగిత్యాల మహబూబ్‌నగర్, నర్సంపేట కోరుట్ల, మెట్‌పల్లి ఆర్మూర్, నిర్మల్, మంచిర్యాల ఆదిలాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యే కంగా 850 బస్సులను నడుపుతున్నారు. భక్తులకు స్వామివారి ప్రసాదం కోసం ఐదు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. అభిషేకం లడ్డూ 100, సాధారణ లడ్డూ .20, పులిహోర 15 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. భక్తులు రాజన్న ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి 300, కోడె మొక్కుకు 200 రూపాయలు వసూలు చేయనున్నారు. భక్తులకు జాగరణ సమయంలో ప్రత్యేకంగా శివార్చన వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.




చలువ పందిళ్ల కింద సేదతీరుతున్న జాతరకు వచ్చిన భక్తులు

తరలి వస్తున్న భక్తులు

అడుగడుగునా పోలీస్ బందోబస్తు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రికి మంగళవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి 11 గంటల నుంచి 1.30 గంటల వరకు పురజ నులకు దర్శనం అవకాశం కల్పించారు. 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు దాతలు, అధికారులు, మీడియా ప్రతినిధులకు దర్శనం కల్పించారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న దర్శనం కోసం క్యూలైన్ లో బారులు తీరారు.

అడుగడుగునా సోదాలు..

వేములవాడలో నిర్వహించే మహా శివ రాత్రి జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో 1500మంది పోలీసులు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. రాజన్న క్షేత్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని సోదాలు చేస్తూ పట్టణంలోకి అనుమతిస్తున్నారు. 900లకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

రాజన్నను దర్శించుకున్న భక్తులు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ధర్మ గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం, కోడె మొక్కు కూలైన్‌లో భక్తులు ఆలయం లోకి చేరుకుని శ్రీపార్వతిపర మేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు.




జాతరకు వేములవాడకు వస్తున్న వృద్ధులు


ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వైభవంగా దుబ్బరాజన్న కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్


శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం దుబ్బరాజన్న క్షేత్రంలో మంగళవారం వేదపండితులు చంద్రశేఖర్ శర్మ నేతృత్వంలో శివ పార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ స్వామి వార్ల కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలను అందించి సత్కరించారు. ముందుగా కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకిం చేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, ఆలయ ఛైర్మన్, పొరండ్ల శంకరయ్య, కొల్ముల రమణ, కోంద్ర రాంచందర్‌రెడ్డి, కోల జమున శ్రీనివాస్, ఆకుల రాజిరెడ్డి, తోడేటి శేఖర్‌గౌడ్, బొడ్డుపెల్లి రాజన్న ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల చేయూతతో శివాలయానికి పునర్ వైభవం

రాయికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయం భక్తుల చేయూతతో పునర్ వైభవం పొంది మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. నాలుగు దశాబ్దాల క్రితం చౌవులమద్ది శివలింగం అనే దళిత వ్యక్తి కృషితో నిర్మితమై ఆయన చేతనే పూజలు అందుకుంది. 2024లో శివలింగం శివైక్యం చెందడంతో నిత్య పూజలు ఆగిపోయి శివాలయం ఆదరణ కోల్పోయింది. దీంతో శివ భక్తులైన యువకులు మన శివాయలం పేరిట గత అక్టోబరు నెలలో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయడంతో పలువురు స్పందించి విరాళాలు అందించారు. వాట్సాప్ గ్రూపులో 689 మంది సభ్యులుగా ఉన్నారు. అందులో ఆలయానికి సంబంధించిన వివరాలు, ఖర్చులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు. శివలింగం కుటుంబసభ్యులతో పాటు మన శివాలయం పేరిట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. వాట్సాప్ గ్రూపులో ఉన్న సభ్యులంతా నెలకు రూ.100 చొప్పున క్యూఆర్ కోడ్‌తో ఉన్న అకౌంట్‌లో వేస్తే ఆలయ అకౌంట్‌లో జమ అవుతున్నాయి. వాటిని ప్రతి నెలా ఆలయ పూజారి వేతనం, నిత్య దీపారాధనకు వెచ్చిస్తున్నారు. దీంతో శివాయంలో మళ్లీ పూజలు ప్రారంభం కావడంతో భక్తుల రాక పెరిగింది.


ఉత్సవాలకు ముస్తాబైన రాయికల్ శివాలయం

కోటి వరాల దేవుడు రాజన్న..

- ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్
- విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్నకు పట్టువస్త్రాల సమర్పణ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కోడెమొక్కు చెల్లించుకుంటే కోటి వరాలు ఇచ్చే దేవుడిగా వేములవాడ రాజన్న ప్రసిద్ధి కెక్కాడని, దేశంలో ఎక్కడా లేని మొక్కు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీరాజరాజేశ్వర స్వామివారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులతో కలిసి పొన్నం దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన పొన్నంకు ప్రభుత్వ విప్, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల మధ్య పట్టువస్త్రాలను తీసుకుని ఆలయంలోకి ప్రవేశించారు.

ముందుగా శ్రీలక్ష్మీగణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరాజరాజేశ్వరస్వామి వారి అభిషేక పూజలో పాల్గొ న్నారు. అనంతరం జగజ్జనని శ్రీపార్వతి దేవి అమ్మ వారిని దర్శించుకుని తరించారు. మహా మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ రాజన్న సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎనిమిది మంత్రి మంత్రులం ఆలయానికి వచ్చామని, ఆలయాభివృద్ధికి తోటి మంత్రులతో కలిసి కృషి చేస్తున్నామని, రాజన్న ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అధికారులు సమన్వ యంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని, రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఉపవాసంతో ఉంటారని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామ న్నారు. వచ్చే శివరాత్రి వరకు అభివృద్ధి పనులు ముందుకు సాగేలా రాజన్నను వేడుకున్నట్లు తెలిపారు.

లోకకళ్యాణం జరగాలని వేడుకున్నాను.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని, లోకకళ్యాణం జరగాలని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని వేడుకున్నానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. భక్తులకు త్వరగా దర్శనం కలిగేలా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అంతే కాకుండా రాజన్న ఆలయంలో రూ. 70 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరింత అభివృద్ధి జరిగే లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ముందుకు సాగుతామన్నారు. వెంట ఈవో వినోద్‌రెడ్డి కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, నాగం కుమార్, చిలుక రమేష్ సాగరం వెంకటస్వామి, పొత్తూరి శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్నకు టీటీడీ పట్టువస్త్రాలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి తిరుమల, తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవో లోకనాథం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అలాగే స్వామివారి ఆలయానికి శృంగేరి పీఠం తరఫున వేదపండితులు రాధకృష్ణశర్మ పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల, తిరుపతి, శృంగేరి సభ్యులను మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు ఘనంగా సన్మానించారు.


రాజన్నకు పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ దంపతులు, తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న డిప్యూటీ ఈవో లోకనాథం, శృంగేరి పీఠం నుంచి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న రాధకృష్ణశర్మ

కన్నుల పండువగా మల్లికార్జునుడి శోభాయాత్ర


ఓదెల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం భ్రమరాంబ మల్లికార్జునస్వామి శోభాయాత్రను కన్నులపండువగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా ఊరేగించి మేళతాళాలతో ఒగ్గుడోలు కళాకారులు, పోతరాజుల నృత్యాలతో స్వామివారిని ఊరేగించారు. మహిళలంతా మంగళహారతులతో ఉత్సవ మూర్తులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈవో సదయ్య, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.




సూక్ష్మ కళాకారుడి ప్రతిభ

గుండు పిన్నుపై శివయ్య, నందీశ్వరుడు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ గుండు పిన్నుపై శివయ్య, నందీశ్వరుడిని తయారు చేశాడు. ఇంతకు ముందు గుండు పిన్నుపై వివిధ కళాఖండాలను రూపొందించిన దయాకర్‌ను పలువురు ప్రశంసించారు.




గుండు పిన్నుపై తయారు చేసిన శివయ్య, నందీశ్వరుడు, కళాకారుడు దయాకర్

చాక్ పీస్‌లతో శివలింగం

ఓదెల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మడకకు చెందిన సూక్ష్మ కళాకారుడు ఆడేపు రజనీకాంత్ చాక్‌పీస్ లతో 109 శివలింగాలను రూపొందించారు. సుమారు పది గంటల పాటు శ్రమించి సూక్ష్మ కళా నైపుణ్యంతో తీర్చిదిద్దారు. సెంటీమీటర్ ఎత్తు, వెడల్పు, చాక్ పీసులపై స్కాల్పరింగ్ ఆర్ట్ ద్వారా గుండు పిన్నులతో శివలింగాలను రూపొందించినట్లు తెలిపాడు. గతంలో పెన్సిల్ గ్రాఫైట్‌పై శివలింగం, క్యారెట్, బంగాళదుంపలతో కార్వింగ్ కళా నైపుణ్యంతో శివలింగాలను తయారు చేసినట్లు రజనీకాంత్ తెలిపారు. గతంలో కూడా ఇలాంటి ఆకృతులను రూపొందించి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్, ఆర్‌హెచ్‌ఆర్ ప్రపంచ రికార్డులు, ఉత్తమ కళాకారుడిగా అవార్డు అందుకున్నారు.




చాక్‌పీస్‌లతో రూపొందించిన శివలింగం, కళాకారుడు రజనీకాంత్



జ్యోతిప్రజ్వలన చేసి శివార్చన వేదికను ప్రారంభిస్తున్న పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్

శివార్చన వేదికను ప్రారంభించిన మంత్రి, విప్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ గుడి చెరువులో ఏర్పాటు చేసిన శివార్చన వేదికను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డితో కలిసి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శించిన ఒగ్గు కళాకారుల నృత్యాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, మామిడి హరికృష్ణ, నాగం కుమార్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్, తూం మధు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్, పొత్తూరి శ్రీనివాస్ ఉన్నారు.



కళాకారులతో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగలవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతా ళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహర నాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

పట్టభద్రులు.. మీ ఓటు పదిలంగా వేయండి



చొప్పదండి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సమయం దగ్గర పడుతుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లకు భిన్నంగా జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది. అనేక మంది కొత్తగా ఓటర్‌గా నమోదు కాగా ఓటు వేయడానికి పలు జాగ్రత్తలు పాటించాలి. ఓటు వినియోగంపై పట్టభద్రుల అవగాహన కోసం..

ఓటు ఇలా వేయాలి...

- పోలింగ్ బూత్ బయట మీ ఓటర్ క్రమసంఖ్యను చూసుకోండి.
- బూత్ లోపలికి వెళ్లే ముందు మీ పేరు చూసుకొని సంతకం చేయాలి.
- ఓటు వేయడానికి వెళ్లే సమయంలో ఎన్నికల కమిషన్ సూచించిన ఏదైనా ఐడీ కార్డును వెంట తీసుకుపోవాలి.
- పోలింగ్ కేంద్రాలలో ఇచ్చే పెన్‌ను మాత్రమే వాడాలి.
- పోలింగ్ బూత్‌లో మీకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థి పేరు, ఫొటో ఉంటుంది.
- మీరు మొదటి ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్స్‌లో ఒకటి అని రాయాలి.
- ఇతర అభ్యర్థులకు కూడా మీరు నచ్చిన ప్రాధాన్యత ఓటు వేసుకోవచ్చు. 1,2,3 ఇలా నంబర్ వేసి ఓటు వేసుకోవచ్చు.

ముఖ్యాంశం..

ఓటర్లు చేయకూడని పనులు

- పోలింగ్ బూత్‌లో మీ స్వంత పెన్‌ను వాడవద్దు.
- అభ్యర్థులు అందరికీ ఒకే నంబర్ ఇవ్వవద్దు.
- బ్యాలెట్ పేపర్‌లోని బాక్స్‌లో ఒకటి అని రాయవద్దు. ఇంగ్లీష్‌లో కూడా రాయవద్దు. కేవలం అంకెలు (1,2,3) అని మాత్రమే వేయాలి.
- బ్యాలెట్ పేపర్‌లో ఎక్కువ పేర్లు ఉంటాయి. మీకు నచ్చిన వారికి 1 నంబర్ వేయాలి.
- ఎన్నికల సిబ్బంది చెప్పినట్లుగానే బ్యాలెట్ పేపర్‌ను ఫోల్డ్ చేయాలి. లేని పక్షంలో ఓటు చెల్లదు.
- బ్యాలెట్‌ను ఖాళీగా వేయరాదు. ఇంక్ పెన్నుతో ప్రాధాన్యత నంబర్‌ను రుద్దవద్దు.
- అభ్యర్థి పక్కన సూచించిన బాక్స్ వద్ద కాకుండా ఇతర చోట్ల అంకెలు వేస్తే ఓటు చెల్లదు.
- బ్యాలెట్ పేపర్‌లో (1,2,3) అంకెల ప్రాధాన్యత కాకుండా ఇతర నెంబర్లు వేస్తే ఓటు చెల్లదు.

ఎమ్మెల్సీ ఫలితాలను రెఫరెండంగా భావిస్తారా..

● ఎన్నికల్లో గెలిచేది బీజేపీ అభ్యర్థులే.. ● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ 14 నెలల పాలన బాగుందని అంటున్న సీఎం ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకునేందుకు సిద్ధమా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. కులగణనకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చి మూడు నెలలైనా ఎందుకు బయటపెట్టలేదన్నారు.

ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ వల్లే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డే చెప్పారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ గడువును పొడగిస్తున్నారే తప్ప కేసీఆర్‌ను ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. దమ్ముంటే సీబీఐ విచారణ కోరాలని, దోషులందరినీ అరెస్టు చేసి బొక్కలో వేస్తామన్నారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అంటే రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా వరి వేయొద్దు వేస్తే నష్ట పోతారని రైతులను హెచ్చరిస్తున్నారన్నారు. పొరుగు రాష్ట్రానికి నీటిని దోచి పెట్టడం వల్లే ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడ్డా నీటి కటకట ఎందుకు వచ్చిందన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసేది బీజేపీ పార్టీ మాత్రమే అన్నారు. బీజేపీని ఆదరించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలరాం చంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, పక్కన ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు

కేంద్ర మంత్రి బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి..



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

- అడుగడుగునా బీసీలను అణచివేస్తున్న బీజేపీ
- పట్టభద్రుల ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రమంత్రి స్థాయిలో వ్యవహరించకుండా బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బండి సంజయ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఫార్ములా ఈ రేసు అవినీతిపై కేటీఆర్‌పై కేసు నమోదై, విచారణ జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు కూడా ఇవ్వలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ వాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల నుంచి నిందితులను తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న పరిమితి ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేస్తున్న అబివృద్ధి పై చర్చకు సిద్ధమన్నారు.

ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు 10 ఏళ్లలో 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. సోషల్ మీడియాను అనైతికంగా అబద్ధపు ప్రచారానికి, వీడియోలను మార్ఫింగ్ చేయడానికి బీజేపీ విచ్చలవిడగ వాడుతోందని విమర్శించారు. దీనిని ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కారించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల పాత్ర ఏంటి? అనేది ఒక సారి ఆలోచన చేసుకోవాలన్నారు. సమగ్ర కుల గణనపై సర్వేపై బీజేపీ తన అభిప్రాయం ఏంటో చెప్పాలన్నారు. ధైర్యం ఉంటే బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేరుస్తామని, ప్రధానిని ఒప్పించి 42 శాతం రిజర్వేషన్లకు తెస్తామని బీజేపీ నేతలు చెప్పా లన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రాష్ట్ర స్థితిగతులు రాష్ట్ర అంశాలను అవగాహనతో ఓటు వేసే అంశమని, బీసీలను అణగదొక్కుతున్న బీజేపీకి ఓటేస్తారా...? బీసీలకు సర్వం చేస్తున్న కాంగ్రెస్‌కు ఓటేస్తారా పట్టభద్రులు ఆలోచించాలన్నారు. నిన్న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో జరిగిన సమావేశాలు విజయవంతం కావడంతో దిమ్మతిరిగి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు.

సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగ రాఘవరెడ్డి, నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, ఎర్ర శ్రీనివాస్, వైద్యుల అంజన్ కుమార్, ఎండీ తాజొద్దీన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, ఆకుల ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఏమి చేయగలడో చేసి చూపిస్తా

రాజకీయాలను కలుషితం చేస్తున్న రెండు పార్టీల అభ్యర్థులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఎమ్మెల్సీలుగా గెలిచిన వారెవ్వరూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోలేదు.. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఏమి చేయగలడో చేసి చూపిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సర కాలంగా 42 నియోజక వర్గాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానని తెలిపారు. డబ్బులు ఉంటేనే రాజకీయం చేయవచ్చు భావన అనే పోవాలని, బలహీన వర్గాల బిడ్డ ఎందుకు రాజకీయం చేయవద్దు అనే అంశంతో తాను ముందుకు వచ్చానన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో ఒకరు పారిశ్రామిక వేత్త, ఇంకొకరు కార్పొరేట్ విద్యావేత్త అని, వీళ్లు ఎందుకు రాజకీయాలను కలుషితం చేస్తున్నారని ప్రశ్నించారు. వారు ఈ రోజు డబ్బులు పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. తాను అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజల ముందుకు వచ్చానన్నారు. తాను గెలవక పోతే డబ్బులు రాజకీయాలను ప్రభావితం చేసినట్లేనని, రాజకీయాల్లో డబ్బు ప్రామాణికం కాదన్నారు. తెలంగాణ రూపురేఖలు మారాలి అంటే తన లాంటి వాళ్ళు గెలవాలన్నారు. ఈ గుండె ఏడు నెలలుగా తిరిగి అలిసి పోయిందని, భవిష్యత్ రాజకీయాల్లో ఈ గుండెను మీరే ముందుకు తీసుకుపోవాలన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఇన్ని రోజులు ప్రచారం చేసానని, రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బులు లేకుండా విద్యావంతులు సర్పంచ్‌లు కావాలి అంటే తన గెలుపు నుంచి మొదలవ్వాలన్నారు. మహిళా సాధికారత గురించి ఏ పార్టీ చర్చించలేదని, తన పేరులో సగం తన భార్యపేరు ఉందని, తనకు మహిళలంటే గౌరవం ఉందన్నారు.

'జూకంటి'కి కొలకలూరి కవితా పురస్కారం

నేడు హైదరాబాద్‌లో ప్రదానం



సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కవి జూకంటి జగన్నాథం రచించిన 'ఒక కప్పు ఛాయ్- నాలుగు మేసేజ్‌లు' కవితా సంపుటి కొలకలూరి భగీరథ కవితా పురస్కారానికి ఎంపికయ్యింది. బుధ వారం సాయంత్రం హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీలో ఎన్‌టీఆర్ కళాప్రాంగణంలో నిర్వహించ నున్న కార్యక్రమంలో జూకంటి జగన్నాథంకు నిర్వాహకులు పురస్కారం అందించనున్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడికి జీవిత ఖైదు

సుల్తానాబాద్ ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదుతోపాటు ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ పెద్దపల్లి మున్సిఫ్ జడ్జ్ సెషన్ కోర్టులో మంగళవారం తీర్పు ఇచ్చారు. పూసాల గ్రామానికి చెందిన తీగల నర్సయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి భార్య భూదేవి, కొడుకు రాజేషంతో పాటు మరో కుమారుడు ఉన్నారు. జులాయిగా తిరుగుతూ ఇంటి వద్ద ఉంటున్న కొడుకు రాజేశంను ఐకేపీలో ఆరబోసిన ధాన్యం పనుల్లో సహాయం కోసం రమ్మన్నాడు. ఐకేపీ సెంటర్ వద్ద తండ్రి కొడుకుల మధ్య ఘర్షణ జరగగా ఆవేశంలో కొడుకు రాజేశం తండ్రి నర్సయ్యను నెట్టి వేయగా కింద పడిన తండ్రి తలపై రాయి వేయగా నర్సయ్య అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటనపై తీగల భూదేవి ఫిర్యాదు మేరకు 8 డిసెంబర్ 2023లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేయగా మంగళ వారం పెద్దపల్లి జిల్లా కోర్టులో రాజేశంకు జీవిత కాలం కఠిన కారాగార శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధించారు.

విద్యార్థిని వేధించిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష

సుల్తానాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పూసాల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని వేధింపులకు గురి చేసిన మియాపూర్ గ్రామానికి చెందిన గోషిక కుమార్‌కు నెల రోజుల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీనివాస రావు మంగళవారం తీర్పు ఇచ్చారు. వేధింపుల సంఘటనపై 20 నవంబరు 2019న బాధితురాలి తండ్రి సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో కేసు విచారణ జరిగింది. నేరం ఋజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి



కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మెకిరాల చంద్రయ్య (71) అనే వ్యవసాయ కూలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం చంద్రయ్య గ్రామ శివారులోని మామిడితోటలో కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటికి భోజనానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో చంద్రయ్య అక్కడి కక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చంద్రయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

మాదాపూర్ గ్రామంలో ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట చంద్రయ్య మృతదేహంతో బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చంద్రయ్య బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించి వేశారు. చంద్రయ్య అంత్యక్రియలను నిర్వహించే వరకు పోలీసులు గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు.

తండ్రి ఆస్తి కోసం కొడుకు పథకం



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

- హుజూరాబాద్ చోరీని 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- కొడుకు, కోడలుతో పాటు మరో ముగ్గురు అరెస్టు, పరారీలో ఒకరు
- 70 తులాల బంగారం, రూ.1.50లక్షలు స్వాధీనం

హుజూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తండ్రి ఆస్తిని కాజేయాలని కొడుకు, కోడలు పథకం వేశారు. హుజూరాబాద్‌లో సంచలనం సృష్టించిన భారీ దొంగతనం కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. అప్పుల పాలై తండ్రిని డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో కొడుకు, కోడలు ఆస్తి కోసమే పథకం ప్రకారం దొంగతనం చేసి దొరికిపోయారు. వీరికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఒకరు పరారీలో ఉన్నారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ మంగళవారం చోరీ వివరాలు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన ప్రతాప రాఘవరెడ్డి-వినోదలకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు ప్రతాప నాగరాజు-శాలినిలు వ్యాపారం చేసి రూ. కోటి వరకు అప్పుల పాలయ్యారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి ఎక్కువ కావడంతో తండ్రి వద్ద ఉన్న డబ్బులు, బంగారం దోచుకోవాలని నెల రోజుల క్రితం ప్లాన్ వేసుకున్నాడు. ఇందుకు అతని హోటల్‌లో పనిచేసే అమీర్‌ను సాయం కోరగా, అతని బంధువైన హనుమకొండ జిల్లా, స్టేషన్‌ఘణపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు సమీర్, కరీంనగర్‌కు చెందిన మున్నా, హుస్నాబాద్ మండలం కుందువని పల్లెకు చెందిన కృష్ణలతో సుపారీ మాట్లాడుకున్నారు. పథకం ప్రకారం హోటల్‌లో దొంగతనం గురించి చర్చించుకొని ఆదివారం రాత్రి నాగరాజు, శాలిని, అమీర్‌లు పక్కనే ఉన్న వారి ఇంటిలో ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత మరో ముగ్గురు కరెంట్ మోటార్ ఆన్ చేయగా నీళ్ల శబ్ధం విన్న రాఘవరెడ్డి భార్య వినోద బయటకు వచ్చింది. సమీర్, మున్నా, కృష్ణలు ఇంట్లోకి చొరబడి, ఆమెను కత్తులతో గాయపరిచి కట్టేశారు. ఈ క్రమంలో రాఘవరెడ్డి, ఆయన కూతురు మానస రూమ్‌లో నుంచి బయటకు రాగానే వారిపై దాడి చేశారు. కత్తులతో బెదిరించి 70తులాల బంగారం, రూ. 5లక్షల నగదును దోచుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం కుటుంబ సభ్యులను పలు కోణాల్లో విచారించారు. కొడుకు నాగరాజుపై అనుమానం రావడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. దీంతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని 70తులాల బంగారం, రూ. 1.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

24గంటల్లో ఛేదించిన పోలీసులు

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో 24గంటల్లోనే దొంగతనం కేసును సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై యూనస్, సీసీఎస్ టీమ్ సురేందర్‌పాల్, సాయి, అవినాష్, టెక్‌టీమ్ సిబ్బంది ప్రదీప్, సంతోష్ పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పథకం ప్రకారం నాగరాజు హోటల్‌లో పనిచేసే అమీర్ వేలిముద్రలు దొరకవద్దనే ఉద్దేశ్యంతో ముందస్తుగా హుజూరాబాద్ పట్టణంలోని ఓ మెడికల్ షాపులో వారం రోజుల క్రితం గ్లౌజులు కొనుగోలు చేశాడు. అంతేకాకుండా దొంగతనంలో జరిగిన పెనుగులాటలో ఓ వ్యక్తి బ్రాస్‌లెట్ పడిపోయింది. వాటిని ఆధారంగా తీసుకున్న పోలీసులు మెడికల్ షాపునకు వెళ్లి సీసీ ఫుటేజీలను తీసుకొని విచారించగా నాగరాజు కొనుగోలు చేయమంటే గ్లౌజులు కొనుగోలు చేశానని అమీర్ చెప్పాడు. అలాగే నాగరాజు సెల్‌ఫోన్ డాటా ఆధారంగా కూపీ లాగడంతో దొంగతనం కేసు బయటపడింది. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులను ఏసీపీ శ్రీనివాస్‌జీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడానని, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకనై ప్రశ్నిస్తానని కరీంనగర్, నిజామా బాద్, మెదక్, ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీతో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని, కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వంతో పోరాడుతానని హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాల చెల్లింపు, హెల్త్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ వసతి గృహ భవనాల నిర్మాణాలు, తదితర సమస్యల పరిష్కారంలో ముందుంటానని హామీ ఇచ్చారు. టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము రమేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి లక్ష్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి అశోక్‌కుమార్ గెలుపునకు సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు ఓటేయాలని కోరారు. సమావేశంలో పోచయ్య, పర్శరాములు గౌడ్, జీవన్ రాజు, కోల రాజమల్లు, డానియల్, దేవదానం, హెచ్‌ఎం నేదునూరి కనకయ్య పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీగా అశోక్‌కుమార్‌ను గెలిపించండి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

కరీంనగర్ టౌన్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీగా ఉద్యమ నేత అయిన వై.అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఆయన సమావేశయ్యారు. 36 ఏళ్లకుపైగా ఉపాధ్యాయ ఉద్యమ అనుభవం కలిగిన తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యోగుల జేఏసీ నాయకుడిగా అశోక్ కుమార్ పనిచేశారని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేశారని అన్నారు. ఆయనను టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై అశోక్‌కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తిరుపతి, కె రమేష్, అశోక్‌కుమార్‌పాల్గొన్నారు.

ఘనంగా వాణినికేత్ పాఠశాల వార్షికోత్సవం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అంజనారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వాణినికేతన్ పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం తరంగ్-2025 పేరుతో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడాకారుడు అంజనారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. పాఠశాల డైరెక్టర్ రేణుక, అకాడమి డైరెక్టర్ హన్మంతరావు, నీలకంఠం, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్లోరికాలో స్పోర్ట్స్ స్టార్ట వేడుకలు


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న డైరెక్టర్ ప్రసాద్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జ్యోతినగర్ ఎక్స్‌ప్లోరికా పాఠశాల వార్షిక క్రీడా దినోత్సవాన్ని స్పోర్ట్స్ స్టార్ట పేరుతో మంగళవారం అల్గునూరులోని పారమిత వరల్డ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ వీయూఎం ప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేశారు. క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. విజేతలను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాద్‌రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేష్, ప్రాచీ, వినోద్ రావు, టీఎస్‌వీ రమణ, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు శర్మిష్ట పాల్గొన్నారు.

నెట్‌లో ఎస్ఆర్ఆర్ కళాశాల గెస్ట్ లెక్చరర్ ఉత్తీర్ణత


జి.జయంతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష (నెట్)లో స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న జి.జయంతి ఉత్తీర్ణత సాధించారు. 2024 డిసెంబరులో యూజీసీ నిర్వహించిన నెట్ ఫలితాలను ఇటీవల విడుదల చేసింది. ఈ పరీక్షల్లో జయంతి కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్‌లో ఉత్తీర్ణత సాధించారు. జాతీయ స్థాయిలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ సందర్భంగా జయంతిని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

కాంగ్రెస్ బలహీనపడిందనే సీఎం సుడిగాలి పర్యటన


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలహీనపడడంతోనే గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి మూడు జిల్లాల్లో సుడిగాలి పర్యటన చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా మాజీ చైర్మన్ జీవీ రామకృష్ణారావు అన్నారు. మంగళవారం నగరంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభల్లో పట్టభద్రుల గురించి మాట్లాడకుండా కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవితపై ఎప్పటిలాగే విమర్శలు చేశారని, ఆయన ప్రసంగం పాత చింతకాయ పచ్చడిలా ఉందని విమర్శించారు. కరీంనగర్‌లోని సీఎం ప్రసంగంలో అన్ని అబద్ధాలేనంటూ సభకు వచ్చిన పట్టభద్రులు వెళ్లి పోయారన్నారు. ఆ సభలో 15, 20శాతానికి మించి పట్టభద్రులే లేరన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడినా గెలిచినా అయ్యేదేమీ లేదంటూనే ఒకే రోజు మూడు సభల్లో రేవంత్‌రెడ్డి పాల్గొనడం, కాంగ్రెస్‌కు ఓటు వేసినా వేయకపోయినా ఫరవాలేదన్నట్లు మాటాడారని, హామీలు నెరవేర్చలేమని చెప్పకనే చెప్పారని అన్నారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడు షౌకత్‌అలీ, సుడా మాజీ డైరెక్టర్ వంగర రవీందర్ పాల్గొన్నారు.

టీబీపై గ్రామస్థులకు అవగాహన

ఇల్లందకుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్ మాట్లాడుతూ టీబీ నిర్ధారణ అయితే మందులు పూర్తిగా ఉచితంగా పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటాయన్నారు. చికిత్స తీసుకున్నప్పుడు పోషకాహారం కోసం ప్రతి నెలా వారి బ్యాంకు ఖాతాల్లో రూ. వెయ్యి జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు కల్యాణ్, హిజ, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఏఎన్ఎంలు స్వప్న, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

మానకొండూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో మంగళవారం మూడు 63 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎస్ఈ మేక రమేశ్ ప్రారంభించారు. అంతకు ముందు ఊటూర్ సబ్‌స్టేషన్‌లో వేగురుపల్లి, వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామాల ఫీడర్స్‌కు ఒకే సర్క్యూట్ బ్రేకర్ ఉండడంతో ఈ రెండు గ్రామాలకు వేర్వేరు బ్రేకర్‌లను అమర్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డీఈ ఎం. తిరుపతి, అల్గునూర్ ఏడి శ్రీనివాస్, మానకొండూర్ ఏఈ ఆర్. సత్యనారాయణ సిబ్బంది ఉన్నారు.

శ్రీ చైతన్య కళాశాల అధ్యాపకుడికి గౌరవ డాక్టరేట్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న కందుకూరి చంద్రసేన చారికి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసినట్లు శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చంద్రసేన చారిని ఆయన అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్


ప్రైవేటు టీచర్ల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్ గౌడ్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రైవేట్ టీచర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని, మరిన్ని ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతు ఇస్తుందన్నారు. బీజేపీ మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందడం ఆనవాయితీగా మారిందన్నారు.

● మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత 15 నెలలుగా కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులను చూసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

● డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణ, నాయకులు మామిడి అనిల్‌కుమార్, రమేష్, లక్ష్మారెడ్డి, రాము, రమేష్, రాములు, ఆశిష్ పాషా, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా సాగాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా అన్నారు. మంగళవారం రేకుర్తిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమపాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం ముందు వైకల్యం అడ్డురాదన్నారు. కష్టపడకాకుండా ఇష్టపడి చదవాలన్నారు. పాఠశాలలోని కంప్యూటర్ గదిని, తరగతిగదులు, విద్యార్థుల హాస్టల్ సముదాయం, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన తబలా వాయిద్యం, పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సబిత, విద్యాధికారి జనార్దన్‌రావు, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు, ఇందుకోసం ఇప్పటివరకు 300 ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమేశ్‌బాబు తెలిపారు. నగరంలోని వినాయక్ నగర్‌లో ఏర్పాటు చేసిన డీటీఆర్‌ను మంగళవారం ప్రారంభించారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలనేది ప్రభుత్వ సంకల్పమన్నారు. డివిజనల్ ఇంజనీర్ జంపాల రాజం, ఏడీఈ లావణ్య, ఏఈ త్రిమూర్తి, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రమణారావును డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ ఆధ్వర్యంలో సన్మానించారు.

నేషనల్ సైన్స్‌డే పోస్టర్ ప్రజెంటేషన్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం పోస్టర్ ప్రజెంటేషన్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ సైన్స్‌పై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

కరీంనగర్ కల్చరల్ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉదయ సాహితీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గంలో కరీంనగర్‌వాసులకు చోటు దక్కింది. గౌరవాధ్యక్షుడిగా దాస్యం సేనాదిపతి, ఉపాధ్యక్షురాలిగా చిందం సునీత, ఉపాధ్యక్షుడిగా రాజారెడ్డి, సహాయ కార్యదర్శిగా రాజన్న, సభ్యులుగా ఉషశ్రీ, విజయలక్ష్మి, సంజీవ్‌ను నియమించారు.

చివరి రోజు.. ముమ్మర ప్రచారం

ఎమ్మెల్సీ అభ్యర్థులు, మద్దతుదారులు ముమ్మరంగా ప్రచారం సాగించారు. మంగళవారం ప్రచారానికి చివరిరోజు కావడంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. తమకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

హుజూరాబాద్: పట్టభద్రులు, టీచర్ల సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో మార్నింగ్ వాకర్లను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

మేధావులను శాసనమండలికి పంపాలి

సుభాష్‌నగర్: వివిధ రంగాల్లో నిష్ణాతులైన మేధావులనే శాసనమండలికి పంపాలని రిటైర్డ్ ప్రొఫెసర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్న కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ప్రొఫెసర్‌గా పని చేశానని, తనకు అన్ని రంగాలపై అవగాహన ఉందని అన్నారు. సీరియల్ నంబరు 27పై మొదటి ప్రాధాన్య ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

హామీలను నెరవేర్చని కాంగ్రెస్

సుభాష్‌నగర్: నిరుద్యోగులకు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజిక తెలంగాణ, సేవే తన ప్రధాన లక్ష్యమని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించానని తెలిపారు. హక్కుల కోసం పోరాడే తనలాంటి సామాన్యుడికి మద్దతుగా నిలవాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. రాజ్‌కుమార్ సతీమణి డాక్టర్ సాయికృష్ణప్రియ పాల్గొన్నారు.

కార్పొరేట్‌తో ప్రభుత్వ విద్య నిర్వీర్యమయ్యే ప్రమాదం

సుభాష్‌నగర్: కార్పొరేట్ శక్తులతో ప్రభుత్వ విద్య నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఎల్.సుహాసిని అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విద్యను కాపాడాల్సిన సర్కారు కార్పొరేట్ వ్యక్తులకు అధికారం అప్పజెప్పాలని చూస్తోందన్నారు. తనను గెలిపిస్తే శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకనవుతానని, 15 నంబరుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మల్క కొమురయ్యను గెలిపించాలి

భగత్‌నగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్యను గెలిపించాలని కోరుతూ పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి, బీజేపీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. బీజేపీనాయకులు ఇన్‌రెడ్డి తిరుమల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పర్శరాములు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి బార్ కౌన్సిల్ చైర్మన్ ప్రచారం

భగత్‌నగర్: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని బార్‌కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. బీజేపీ లీగల్ సెల్ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొగ్దుంపూర్‌లో బీజేపీ ప్రచారం

కరీంనగర్ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల స్థానంలో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని గెలిపించాలని బీజేపీ నాయకులు మంగళవారం మొగ్దుంపూర్‌లో ప్రచారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాగౌడ్, కూకట్ల రమేష్, దామెరపల్లి ప్రదీప్ పాల్గన్నారు.

ముస్తాక్ అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు

సుభాష్‌నగర్: కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి ముస్తాక్‌అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ప్రకటించింది. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పట్టభద్రుల సమస్యలపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు ముస్తాక్‌అలీ పూర్తిగా కట్టుబడి ఉన్నారని, మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపంచాలని తెలిపారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

చొప్పదండి: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు విలాసాగరం అంజయ్య, బద్దెనపల్లి రాజు, రామడుగు ప్రశాంత్, అమరగంటి మహేష్, రవి, పెరుమాండ్ల హరీష్, కేలపురి కార్తీక్, మండల సతీష్ పాల్గొన్నారు.

ఒక్కో పట్టభద్రుడికి కాంగ్రెస్ సర్కార్ రూ.54 వేలు బాకీ

భగత్‌నగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో పట్టభద్రుడికి రూ.54 వేలు బాకీ ఉందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14 నెలలుగా నిరుద్యోగ భృతి ఇవ్వని వారు, పట్టుభద్రుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ అడుగు జాడల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని, నిరుద్యోగులు, మహిళలు, పట్టభద్రులు, ఉద్యోగులను అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి గళం విప్పింది బీజేపీ, బీజేవైఎం మాత్రమే అన్నారు. బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యను మొదటి ప్రాధాన్య ఓట్లతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, రాష్ట్ర కార్యదర్శి యువక్రాంతి, అరవింద్, బొడ్డు అశోక్, గుండారపు సంపత్, తోట సాయి, అజయ్, ఉప్పారపల్లి శ్రీనివాస్, ఈసంపల్లి మహేష్, జోన్ అధ్యక్షుడు పొన్నాల రాము పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జీఎస్ ఆనంద్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ మంగళవారం కాంగ్రెస్ కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆనంద్‌తోపాటు నూర్ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ బషీర్, సీహెచ్ లక్ష్మీరాజం, కే కుమార్, ఏ మల్లేశం, డాక్టర్ రహీం కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోడూరు సత్యనారాయణగౌడ్, ఆకార భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, ఎండీ తాజ్, నాత శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై కొట్లాడే ఏకైక పార్టీ బీజేపీ

● ఎంపీ ఈటల రాజేందర్


హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

హుజూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై కొట్లాడే పార్టీ బీజేపీ అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లోని మధువని గార్డెన్‌లో బీజేపీ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హుజూరాబాద్ తన గడ్డ.. అతి కష్టకాలంలో అండగా నిలబడ్డది అన్నారు. కన్నీళ్లకు కరిగిపోయారో.. మోసపు మాటలకు కరిగిపోయారో అయిపోయింది.. జరిగింది మన మంచికే అనుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపు కోసం నేను వచ్చి ప్రచారం చేస్తానన్నారు. హుజూరాబాద్ ప్రజలు నా మాట వింటారని నమ్మకం ఉందన్నారు. రాజకీయాలు పూలబాట కాదు ముల్ల బాటన్నారు. మన మీద జరుగుతున్న కుట్రలన్నీ ప్రజల గమనిస్తున్నారన్నారు. అన్ని చూసి ప్రజలు జడ్జిమెంట్ ఇస్తారని, ప్రజల మీద సంపూర్ణ విశ్వాసం ఉండాలని, వారితో కలిసి నడవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వార్డు మెంబర్ నుంచి ప్రతి ప్రజాప్రతినిధి గెలిపించుకునే బాధ్యత తనదన్నారు. నా ఎన్నికలో ఎలా పనిచేస్తానో మీ ఎన్నికలకు కూడా అలానే పనిచేస్తానని మీ అందరికీ తెలుసన్నారు. 365 రోజులు 24 గంటలు మిషన్ లెక్క పని చేసే మనిషినన్నారు. ప్రజాక్షేత్రంలో సంపూర్ణంగా వెలిసిపోయిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థి లేదని, పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొంరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహిళలకు 33శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు 50శాతం సబ్ కోటా కల్పించాలనే అంశంపై మార్చి 18,19 తేదీల్లో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సోషల్ మీడియా అకౌంట్లు బ్లాక్ చేశారని ఫిర్యాదు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేశారని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గవ్వల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తనతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గవ్వల లక్ష్మి సోషల్ మీడియా ఖాతాను బ్లాక్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

శివరాత్రి వేడుకలు

హుజూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో మంగళవారం శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివపార్వతుల వేషధారణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు.

ముస్తాబైన శివాలయాలు

వీణవంక ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) మండలంలోని నర్సింగాపూర్, చల్లూరు, ఘన్ముక్ల, వీణవంక గ్రామాల్లోని శివాలయాలు మహాశివరాత్రికి విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

సంపూర్ణ బాలల వికాస కార్యక్రమం

చొప్పదండి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ సైనిక స్కూల్‌లో సంపూర్ణ బాలల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సామాజిక భావోద్వేగాలను ఎలా అధిగమించాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ కేసీ రవు, డైరెక్టర్ జి కాళహస్తి, కేకే గౌతమి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివస్వాముల ర్యాలీ

గంగాధర, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): గంగాధరలో శివస్వాములు మంగళవారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. గంగాధర, మధురానగర్ చౌరస్తాలో నలువైపులా శివస్వాములు భజనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఆరోగ్య మహిళా కార్యక్రమం

ఇల్లందకుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు హిమోగ్లోబిన్, థైరాయిడ్, కొలస్ట్రాల్ తదితర రకరకాల టెస్టులు చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, వైద్యులు రోజా, రాణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టెట్రాలో సైన్స్‌ఫెయిర్

హుజూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని టెట్రా హెడ్రన్ మోడల్ స్కూల్‌లో నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని మంగళవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమాన్ని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, ప్రొఫెసర్ రాజేశ్వర్‌రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వాటిని పలువురు తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ముచ్చ నారాయణరెడ్డి, డైరెక్టర్లు రమణారెడ్డి, సంతోష్‌రావు, రాజిరెడ్డి, సంపత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, షెహనజ్ బేగం, రుక్సానా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో మంటలు

శంకరపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి నిప్పంటించగా ఎండిన గడ్డికి మంటలు అంటుకొని విస్తరించాయి. స్థానికులు మంటలను ఆర్పివేశారు.

వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వీవీఎస్ హనుమకుమార్ తెలిపారు. మల్టిపుల్ కెరియర్ సర్వీసెస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీ ఎఫ్‌సి బ్యాంక్, పిన్ వర్క్స్ ఎస్ఎస్ ప్లస్, ఐటీ సొల్యూషన్స్, పిన్వర్క్ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు కందుకూరి సత్యనారాయణ, కొరిమి పీతాంబర్, వినయ్‌లు రాత పరీక్ష ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 82 మంది విద్యార్థులు హాజరు కాగా 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాల సెక్రెటరీ సతీష్‌కుమార్, కిట్స్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వొడితల ఇంద్రనీల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శనిగరపు రజిత, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తాళ్లపల్లి అజయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

గంగాధర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు పొందుతారని సురభి పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం అన్నారు. మంగళవారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ నర్సయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సేవాతత్వం అలవర్చుకోవాలి

గంగాధర, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సేవాతత్వం అలవర్చుకోవాలని, విధుల సమయంలో నిబద్ధతతో పని చేస్తే సంతృప్తితో పాటు గుర్తింపు వస్తుందని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శోభారాణి అన్నారు. గంగాధర ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి ఉద్యోగ విరమణ సన్మాన సభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు శోభారాణి, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి, కరీంనగర్, హుజూరాబాద్, కరీంనగర్ రూరల్, సిరిసిల్ల సీడీపీవోలు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీరాణిలు సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో శోభారాణి మాట్లాడుతూ ఉద్యోగులు తమ సేవలతో సమాజం సంతోషంగా ఉంటే అంతకు మించిన సంతృప్తి ఉద్యోగులకు ఉండదన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న సీడీపీవో కస్తూరి 40 సంవత్సరాలుగా మహిళా శిశు సంక్షేమ శాఖలో వివిధ హోదాల్లో గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. కరీంనగర్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగశేఖర్, వియ్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.